## జనపథం - జనపదం

# ప్రకృతి - మనం

- నిత్యానంద్.

ప్రకృతి అంటే స్వభావం అని, సహజత్వాన్ని కలిగి ఉన్నది అని అర్థము. ప్రకృతి తలక్రిందులైతే అది వికృతి. ఒక వ్యక్తి మరొక వ్యక్తిని చూసిన సందర్భములో అభిమానం, ఆప్యాయత, అనురాగములాంటివి కలిగితే అది ప్రకృతి సిద్ధము. కాని అసూయ, ద్వేషం, క్రోధము కలిగితే అది వికృతము లేదా వికారము. యుగాలు మారుతున్నా పశుపక్ష్యాదులు ప్రకృతితో సంబంధాన్ని కొనసాగిస్తూనే ఉన్నాయి. మానవుడు మాత్రమే అశాశ్వతమైన వస్తువులకోసం నిరంతరాయముగా పరిగెడుతూ, ప్రకృతిని నిర్లక్ష్యం చేస్తున్నాడు. నెమలి పురివిప్పి ఆడడం, కోకిల మధురంగా పాడడం, జింక చెంగుచెంగున గెంతడం ప్రకృతితో వాటికి గల సన్నిహిత సంబంధమే. మరి మానవుడు? రోజు రోజుకు ప్రకృతికి దూరమవుతున్నాడు. ఉదయాన్నే సూర్యోదయమవుతున్నప్పుడు, సాయంత్రము సూర్యాస్తమయ సమయములోనూ (ఏ చిత్రకారుడూ నూరు శాతం రూపం ఇవ్వలేని) రంగుల మేలు కలయికతో హృదయానికి ఆహ్లాదానిచ్చే నింగిని, తాకి ముద్దాడాలని ఎందరికి అనిపిస్తుంది. మనలో ఎంతమంది ఆ సౌందర్యాన్ని వీక్షిస్తున్నారు?

తొలకరి చినుకులు పడినప్పుడు మట్టివాసన, ఉదయాన్నే మంచుబిందువులతో నిండిన పచ్చిక, పూవులనుండి మకరందము గ్రోలే తుమ్మెదలు, సాయంకాలం ఆకాశములో ఎగిరే కొంగల గుంపులు, సాహిత్య గోష్ఠి జరుపుతున్నట్లు మఱ్ఱి చెట్టుపై చేరిన వివిధ పక్షుల అరుపులు, లయబద్ధమైన ధ్వనిని చేస్తూ ప్రవహించే నదీ నదాలు - వీటిని చూసి స్పందించేది ఎంత మంది? అనుక్షణం పరుగులు తీస్తూ (ఊపిరైనా అసంకల్పితంగా జరుగుతుంది కాని, లేకపోతే దానికీ సమయంలేని) బ్రతుకును వెళ్ళదీస్తున్న మనం ప్రకృతిని ఎంతవరకు ఆదరిస్తున్నాం. అనుక్షణం ప్రకృతిని మన స్వార్థం కోసం నాశనం చేస్తున్నాం. మన భవిష్యత్తును మనమే అంధకారం చేసుకుంటున్నాం.

ఎదుటివారు కష్టాలు పడితే ఆనందించే రాక్షస ప్రవృత్తి, మతం-కులం పేరున మారణకాండ సృష్టించడం, ఆస్తులకోసం, అధికారం కోసం, పేరు ప్రతిష్ఠలకోసం దేన్నైనా పణంగా పెట్టే చాలామందికి - ప్రపంచ విజేత కావాలనుకున్న అలగ్జాండర్ వంటి వ్యక్తి చివరిక్షణాలలో ఇచ్చిన సందేశము కూడా కనువిప్పు కలిగించలేకపోవడం దురదృష్టం. బొంబాయిలో ఉన్మాదులు జరిపిన విధ్వంసం, సెప్టెంబరు 11, 2001లో న్యూయార్క్‌లో జరిపిన విధ్వంసం, ఇంకా ప్రపంచ వ్యాప్తంగా అనేక చోట్ల ప్రాణ నష్టం, ఆస్తి నష్టము చెయ్యడము వలన వారికి ఒరిగినది ఏమిటి? ప్రభుత్వాలు దీనిని అదుపుచేసే స్థితిలో లేవు.

నేటి రాజకీయ నాయకులకు పదవులే ముఖ్యం. నాడు సమాజసేవకోసం తమ ఆస్తులను ధారపోసినవారు, పదవులను త్యాగము చేసినవారు ఎందరో ఉన్నారు. నేడు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు గారికి, లాల్ బహదూర్‌శాస్త్రి గారికి, మహాత్మగాంధీ గారికి వారసులేరీ?

గతంలో ఒకసారి ఆంధ్రప్రదేశ్‌లో కోతులు ఊర్లలోకి వచ్చేసాయని, దొరికినవి దొరికినట్లుగా పట్టుకుని పోతున్నాయని వార్త చదివాం. ఎందుకు అలా జరిగింది? వాటికి నివాసములైన చెట్లను నరికి, వాటిని నిలువనీడ లేకుండా చేసినది మనమేనని వేరే చెప్పనవసరంలేదు. వాటికి తినడానికి దొరికే ఫలములను మనమే వాటికి దూరం చేస్తున్నాం. ఇక ఊళ్ళమీద పడడం తప్ప, వాటికీ వేరే మార్గం లేదు. కమలము సూర్యరశ్మికి వికసిస్తుంది మొక్కకు ఉన్నప్పుడు. అదే కమలము మొక్కనుండి వేరయినప్పుడు అదే సూర్యరశ్మికి వడలిపోతుంది. స్థానము తప్పినప్పుడు మిత్రుడే (మిత్రుడు అంటే సూర్యుడు అనే అర్థం కూడా ఉంది) శత్రువయ్యే ప్రమాదముంది. అలాగే పూర్వం పాఠశాలలలో వ్యాయామం నేర్పించే సమయం, ఆటస్థలం, వృత్తి విద్య నేర్పించడం (కార్పెంటరీ, వెల్డింగ్ మొదలైనవి) ఉండేవి. నేడు వాటి సంగతి అలా ఉంచి, పిల్లలు కూర్చోడానికే తగినంత స్థలము ఉండడం లేదు, ఇక ఆటస్థలము గురించి ఆలోచించడం వృధా. ఆ విద్యాలయాలకి, ప్రభుత్వానికి ధనార్జనే ధ్యేయం. స్కూల్‌కి కావలసిన వసతులు ఉన్నాయా? - లేదా? అన్నదాని కంటే - యాజమాన్యం పలుకుబడి, వారు ప్రభుత్వానికి ఇచ్చే సొమ్మును బట్టి పర్మిట్ పొందడం ఉంటుంది. ఎంతసేపూ పుస్తకము (బట్టీయం పెట్టడం), దూరదర్శన్ పరిజ్ఞానము తప్పించి - వారికి ఆట, పాటలలో ప్రవేశం ఉండడం లేదు. దీనివలన వారికి శారీరక వ్యాయామం ఉండదు. ఫలితం ఆరోగ్యం మీద ఉంటుంది. పోటీ మనస్తత్వంతో వారిని అత్యంత ఒత్తిడికి (టెన్షన్‌కి) గురిచేయడం సమంజసమా? నేటి కోచింగ్ సెంటర్లలో 'క్రమశిక్షణ' పేరులో క్రమము పోయి, శిక్షణే మిగిలింది. శిక్షణ ఎక్కువై అది విద్యార్థికి శిక్షకాకుండా చూసుకోవలసిన బాధ్యత మనదే. ఆడుకునే సమయములో ఆడుకోనిస్తేనే పిల్లలకి అందం, ఆనందం, ఆరోగ్యం. కాళ్ళకు సంకెళ్ళు వెయ్యకుండా వారికి కొంత స్వేచ్ఛనిస్తే బాగుంటుందేమో! కిలకిలా నవ్వుతూ చిందులేసే పిల్లల్ని చూస్తే, పురివిప్పి ఆడే నెమలిని చూసినంత ఆనందం కలగదూ! (ముఖచిత్రం గమనించండి!)

**అష్ట కష్టాలంటే మీకు తెలుసా?**

1. దాస్యము 2. దారిద్ర్యము 3. భార్య/భర్త లేకుండుట 4. స్వయంకృషి
5. యాచించడం 6. అడిగి లేదనిపించుకొనుట 7. రోగము 8. ఋణం

**అష్ట ఐశ్వర్యాలు అంటే?**

1. భృత్యులు 2. పుత్రులు 3. మిత్రులు 4. బంధువులు
5. విద్య 6. వాహనములు 7. ధనము 8. ధాన్యము